



నిరసన దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న నాగేశ్వరరావు

# తగ్గిన సాగు...

- సాధారణ సాగులో 71 శాతమే సాగు
- లోటు వర్షపాతమే కారణం
- చిరుధాన్యాలపై ప్రభావం

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

**కర్నూలు జిల్లాలో సాగు ఆశించిన రీతిలో ముందుకు సాగలేదు. లోటు వర్షపాతంతో విత్తనాలు వేసేందుకు అన్నదాతలు అడుగులు ముందుకు వేయలేదు. వరుసగా నష్టాలు మూటగట్టుకుంటుండటంతో విత్తనం విత్తాలా వద్దా అనే సందేహంతో సాధారణ సాగులో 71 శాతం మాత్రమే పంటలను సాగు చేశారు...**



వ్యవసాయమే ప్రధానంగా ఉన్న జిల్లాల్లో కర్నూలు జిల్లా ఒకటి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ సాధారణ సాగులో 71.80 శాతం మాత్రమే విత్తనాలు వేశారు. జిల్లాలో మొత్తం సాధారణ సాగు 10,53,900 ఎకరాలు కాగా 7,56,662.5 ఎకరాల్లో మాత్రమే రైతులు విత్తనాలు వేశారు. వర్షాలు ఆశించిన రీతిలో పడకపోవడంతో విత్తనం విత్తేందుకు రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రధాన పంటగా ఉండే పత్తి సాధారణ సాగు 6,25,067.5 ఎకరాలు కాగా 4,55,577.5 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. 72.65 శాతం పంట సాగైంది. వర్షం లేకపోవడం వల్ల ఇప్పటికే పలు ప్రాంతాల్లో పత్తి చెట్లు ఎండిపోతున్నాయి. వేరుశనగ సాధారణ సాగు 1,66,407.5 ఎకరాలు కాగా 97,447.5 ఎకరాల్లో విత్తనాలు వేశారు. వరి సాధారణ సాగు 32,272.5 ఎకరాలు కాగా 16,510 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. కంది సాధారణ సాగు 59,822.5 ఎకరాలు కాగా 47,925 ఎకరాల్లో, ప్రొద్దుతిరుగుడు సాధారణ సాగు 1,490 ఎకరాలు కాగా 852.5 ఎకరాల్లో విత్తనాలు విత్తారు. ఆముదం సాధారణ సాగు 20,357.5 ఎకరాలు కాగా 15517.5 ఎకరాలో సాగు చేశారు. గతేడాది మిర్చి పంట తెగుళ్లతో భారీగా నష్టాలు మూటగట్టుకోవడంతో రైతులు ఈ ఏడాది మిరప సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఉల్లి సాధారణ సాగు 38,582.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 25,095 ఎకరాలు మాత్రమే సాగు చేశారు.

**చిరు ధాన్యాలపైనా ప్రభావం**

లోటు వర్షపాతం ప్రభావం చిరు ధాన్యాల సాగు పైనా పడింది. మొక్కజొన్న సాధారణ సాగు 10,810 ఎకరాలు కాగా 9,307.5 ఎకరాల్లో సాగు చేశారు. కొర్ర సాధారణ సాగు 4,080 ఎకరాలు కాగా 3225 ఎకరాల్లో సాగు చేశారు. వర్షం అవసరమైన రీతిలో పడకపోవడమే సాగు ముందుకు సాగకుండా పోవడానికి కారణమని పలువురు చెబుతున్నారు.

**సాగు శాతాల్లో...**

| పంట | సాగైన శాతం |
|---|---|
| వరి | 51.16 |
| మొక్కజొన్న | 86.10 |
| కొర్ర | 76.69 |
| కంది | 80.11 |
| వేరుశనగ | 58.56 |
| ప్రొద్దుతిరుగుడు | 57.21 |
| ఆముదం | 76.22 |
| పత్తి | 72.65 |
| ఉల్లి | 64.83 |
| టమోటా | 40.99 |
| ఇతరములు | 50.55 |
| **మొత్తం** | **71.80** |

### ఎపి సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ

# టైమ్ స్కేల్ అమలు చేయాలి

- జెఎసి ఆధ్వర్యంలో నిరసన దీక్ష
- సిఐటియు సంపూర్ణ మద్దతు

**ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్**

ఎపి సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ కనీస వేతనం అమలు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ఎపి సమగ్ర శిక్షలో పని చేస్తున్న 14 రకాల విభాగాల ఉద్యోగులకు ఎంటిఎస్ అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శులు జె.నాగేశ్వర రావు, పి.నిర్మలమ్మ, యుటిఎఫ్ నాయకులు గుమ్మల బాబు డిమాండ్ చేశారు. ఎపి సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులు ఆదివారం కలెక్టరేట్ వద్ద వేడుకోలు దీక్షలు చేపట్టారు. ఈ దీక్షకు గుమ్మల బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 'మాట తప్పను. మడమ తిప్పను. ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తాన'ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో హామీ ఇచ్చారని తెలిపారు. హామీని నెరవేర్చకుండా మాట తప్పారని, ఉద్యోగులు ఇలాంటి ముఖ్యమంత్రి చేష్టలను గమనించాలని కోరారు. 2022 డిసెంబర్ నాటికి 3 లక్షల మంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న వారికి ఎంటిఎస్, మెడికల్ లీవులు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ డిమాండ్లను నెరవేర్చకపోతే చలో విజయవాడ చేపడతామని హెచ్చరించారు. వేడుకోలు దీక్షకు అనేక సంఘాలు మద్దతు తెలిపాయి. యుటిఎఫ్ జిల్లా నాయకులు గుమ్మల బాబు, ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జనార్ధన్, గోకారి, ఎపిటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు మరియానందన్, ఇస్మాయిల్, సిఐటియు నాయకులు సాయి బాబా, ఎఆర్ఎంటి నాయకులు రంగన్న గౌడ్, పుల్లన్న, రాముడు, రవి, ఎంఐఎస్ రాజు, డిటిపి షబ్బీర్, ఐఈఆర్‌టి శాంత కుమార్, కెజిబివి నాగరత్నమ్మ, మెసెంజర్ నాయకులు మహ్మద్ రఫీ, సాయి, బాషా, రాజు, నాగమణి దీక్షలో కూర్చున్నారు. వారికి అన్ని విభాగాల నాయకులు మద్దతు తెలిపారు. దీక్షకు మద్దతుగా ఎపి పిటిఎ రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్ రావు మాట్లాడుతూ... విధుల్లో మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఆ కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, డిఎ, మెడికల్ లీవులు, క్యాజువల్ లీవులు ఇవ్వాలని కోరారు. పిఎఫ్, ఈఎస్ఐ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎస్‌డిపి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

# అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

- అక్షరాస్యత పెంపునకు కృషి - ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన
- జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వెంకటరంగారెడ్డి

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**



**ప్రయివేటు విద్యా సంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వెంకటరంగారెడ్డి తెలిపారు. కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో అక్షరాస్యత శాతం పెంపునకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అక్షరాస్యత పెంపునకు, విద్యారంగ అభివృద్ధి తీసుకుంటున్న చర్యలపై జిల్లా విద్యా శాఖ అధికారి రంగారెడ్డితో ముఖాముఖి...**

**జిల్లాలో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన అందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు..?**

**డిఇఒ :** జిల్లాలో ఈ విద్యా సంవత్సరానికి ఇప్పటికే విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు కింద పనులను చేపట్టి అక్కడ సౌకర్యాలను కల్పించాం. విద్యార్థులకు అవసరమయ్యే తరగతి గదులు, పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులు, ఆర్ఒ వాటర్ ప్లాంట్, టాయిలెట్స్ వంటి సౌకర్యాలను కల్పించాం. ఇంకా అవసరమైన పాఠశాలలకు రెండో విడత కింద చేపడుతున్న నాడు-నేడు పనుల్లో పూర్తిస్థాయి వసతులను కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను మరింత బలోపేతం చేస్తాం.

**పశ్చిమ ప్రాంతంలోని అనేక మండలాల్లో అక్షరాస్యత శాతం తక్కువగా ఉంది. ఇక్కడ అక్షరాస్యత శాతం పెంపునకు ఎలాంటి చర్యలు చేపట్టారు..?**

**డిఇఒ :** పశ్చిమ ప్రాంతంలోని అనేక మండలాల్లో అక్షరాస్యత శాతం పెంపునకు కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఈ మండలాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉండేటట్లు చర్యలు చేపట్టాం. వీటితోపాటు ఈ ప్రాంతంలో ఉన్న పాఠశాలల్లో నాడు-నేడు కింద అన్ని వసతులను కల్పించేందుకు పనులను కూడా చేపడుతున్నాం. ఈ ప్రాంతంలో బడి బయట ఉండే పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు ఈ ఏడాది ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించాం.

**జిల్లాలో ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారు. ఫీజుల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?**

**డిఇఒ :** ప్రయివేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఫీజులను వసూలు చేయాలి. నిబంధనలకు విరుద్ధంగా అధికంగా ఫీజులను వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే సంబంధిత పాఠశాల యాజమాన్యంపై తగు చర్యలు తీసుకుంటాం.

**జిల్లాలో బడి బయట ఉండే పిల్లలను గుర్తించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?**

**డిఇఒ :** జిల్లాలో బడి ఈడు, బడి బయట ఉండే పిల్లలను గుర్తించే ప్రక్రియలో భాగంగా గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వేను నిర్వహిస్తున్నాం. ఈ సర్వేలో భాగంగా బడిఈడు పిల్లలను వెంటనే గుర్తించి అక్కడున్న పాఠశాలలో చేర్పిస్తున్నాం. బడి బయట ఉండే పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో నమోదు చేయిస్తున్నాం. ఇప్పటికే ఈ సర్వే వంద శాతం పూర్తి అవుతోంది.




# బాబు అరెస్టు అప్రజాస్వామికం

- 24 గంటల పాటు కావాలనే నిర్బంధించారు - జగన్‌లా లక్షల కోట్ల అవినీతి చేయలేదు
- నిరాహార దీక్షలో టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు

**ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్**

రాష్టంలో టిడిపి ఎదుగుదల చూసి ఓర్వలేకనే సిఎం ఆదేశాల మేరకే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఉగ్రవాదులు, క్రిమినల్స్ కంటే దారుణంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు అప్రజాస్వామికమని టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు అన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా ఆదివారం ధర్నా చౌక్‌లో బిటి.నాయుడు అధ్యక్షతన నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా బి.టి నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు పోతురాజు రవి కుమార్, వై నాగేశ్వరవు యాదవ్ మాట్లాడుతూ ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పకుండా దేశద్రోహులను అరెస్టు చేసినట్టు వందల మంది పోలీసులు చుట్టుముట్టి అర్ధరాత్రి 12 గంటల నుండి తెల్లవారుజామున 5 గంటల వరకు 500 మంది పోలీసులతో చంద్రబాబు బస చేసిన ప్రదేశాన్ని చుట్టుముట్టి భయభ్రాంతులకు గురిచేశారన్నారు. టిడిపి శ్రేణులు అడ్డుకున్న ఎందుకు అరెస్టు అని అడిగిన ఒక్కరి దగ్గర సమాధానం లేదన్నారు. కక్ష్య పూరితంగా ఉద్దేశ పూర్వకంగానే అరెస్టు చేశారన్నారు. ఒకవేళ అరెస్టు చేసినా నంద్యాల మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచే అవకాశం ఉందని, కావాలనే చంద్రబాబు ధైర్యాన్ని మానసికంగా దెబ్బ తీయాలని 10 గంటల పాటు ప్రయాణం చేయించి 24 గంటలు నిర్బంధించారన్నారు. అధికారపార్టీ అనుకున్న చోట చంద్రబాబును తీసుకెళ్లారన్నారు. జగన్మోహన్ రెడ్డి లాగా లక్ష కోట్ల అవినీతి చేసి 30 నుండి 40 కేసులకు కోర్టుల చుట్టూ చంద్రబాబు తిరగలేదని ఎద్దేవా చేశారు. సొంత చిన్నాన్నను చంపించిన కునికోరు జగన్మోహన్ రెడ్డి అని, అలాంటి క్రిమినల్ ఆలోచనలు ఉన్నది వారికని తెలిపారు. జగన్ ప్రతిపక్షంలో ఉండగా ఇడుపులపాయ నుండి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర చేస్తే ఒక్క నిర్బంధం కూడా లేకుండా ఎక్కడ ఎలాంటి సంఘటనలు లేకుండా భద్రత కల్పించిన ఘనత చంద్రబాబు నాయుడుదన్నారు. ఎప్పటికైనా నిజ నిజాలు తెలుస్తాయని 2024 లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాత్రమే అన్నారు. రాష్ట్ర అనుబంధ కమిటీ సభ్యులు జె.తిరుపాల్ బాబు, నంది మధు, పరమేశ్, సంజీవ లక్ష్మి, దాశెట్టి శ్రీనివాసులు, గోపినాథ్ యాదవ్, సోమిశెట్టి నవీన్, ఎల్లప్ప, సుభాష్ చంద్ర బోస్, కార్పోరేటర్లు జక్రియా అక్సారి, రమణమ్మ, పార్లమెంట్ అనుబంధ కమిటీ అధ్యక్షులు యస్.అబ్బాస్, కె.ఇ.జగదీశ్, ముంతాజ్, జేమ్స్, పి.హనుమంతరావు చౌదరి,వై నరసింహులు, సత్రం రామక్రిష్ణుడు, సుకన్య, లక్ష్మి దేవి, చంద్రకాంత్, గున్నా మార్క్, మోతిలాల్, మాధవస్వామి, రమణ, సుందర్ రాజ్, అఖిల్, వినోద్, బేస్త శ్రీనివాసులు, ప్రభాకర్, దశరథ నాయుడు, గణేశ్, కిరణ్, రామాంజనేయులు, ఎల్లా గౌడ్, నాగేశ్వర రావు పాల్గొన్నారు.



దీక్షలు చేపడుతున్న టిడిపి నాయకులు



## చెన్నమ్మ సర్కిల్‌లో టిడిపి సామూహిక దీక్షలు

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టు అక్రమమని ఆ పార్టీ ఇన్‌ఛార్జి పాణ్యం ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ నిరసనగా ఆదివారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో సామూహిక నిరాహారదీక్షలు చేపట్టారు.మాజీ అధ్యక్షులు గౌరు వెంకట రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆకేపోగు వెంకట స్వామి, కల్లూరు, పాణ్యం మండలాల అధ్యక్షులు రామాంజనేయులు, జయరామి రెడ్డి, మాజీ ఎంపిపి వాకటి మాధవి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, నంద్యాల పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు కే పార్వతమ్మ, సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ యన్ వి రామకష్ణ, పాణ్యం మాజీ జడ్‌పిటిసి నారాయణమ్మ, తడకన పల్లె సర్పంచి సహరాబి, మహిళ నాయకురాలు రాములమ్మ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణ పల్లె నాగిరెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్, కల్లూరు అర్బన్‌నాయకులు కేతురు మధు, రవి ప్రకాష్ రెడ్డి, శ్రీనివాసరావు, సులేమాన్, పవన్‌కుమార్, సులేమాన్ కిష్టఫర్ పాణ్యం నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు టిడిపి అభిమానులు పాల్గొన్నారు.

**గూడూరు:** నారా చంద్రబాబునాయుడును అరెస్టుకు నిరసనగా గూడూరు గ్రామంలో పాత బస్టాండ్ ఆవరణలో నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కోడుమూరు ఇన్‌చార్జి ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడారు. మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు కౌన్సిలర్, రేమట సురేష్, షాషావలి, గుడ్డంగలి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాగలాపురం సర్పంచి నయోమిని, జూలకల్లు సత్యారెడ్డి మాజీ జడ్‌పిటిసి కృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**తుగ్గలి:** చంద్రబాబునాయుడు అరెస్టు పూర్తిగా అక్రమమని టిడిపి నాయకులు కొత్తూరు నాగరాజు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎఫ్ఐఆర్ లో ఎలాంటి పేర్లు లేకుండా ఎలా అరెస్టు చేస్తారన్నారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ను అరెస్టు చేయడం విచారకరమన్నారు. గవర్నర్ ఆదేశా లేకుండా ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో అరాచక పాలనను అవలంబిస్తున్నారని ఆవేదనను వెలిబుచ్చారు.



# సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికి సమరం

**దళిత రక్షణ యాత్ర ప్రారంభం**

**ప్రజాశక్తి-గూడూరు**

రాష్ట్రవ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సామాజిక ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం మరో సామాజిక సమరం కొనసాగిద్దామని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి. ఆనంద్ బాబు అన్నారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న దళిత రక్షణ యాత్రలో భాగంగా ఆదివారం గూడూరు మండల ఆటో జాతాను ఎండి. ఆనంద్ బాబు బూడిదపాడులో ప్రారంభించారు. బూడిదపాడు నుండి నాగలాపురం, పెంచికలపాడు, గుడిపాడు, చనుగొండ్ల, జూలకల్లు, మునగాల మీదుగా గూడూరు వరకు జాతాను నిర్వహించారు. గ్రామాలలోని దళిత పేటల్లో కెవిపిఎస్ మండల కన్వీనర్ నాయకంటి నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలలో ఎండి.ఆనంద్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల భాస్కర్, సిఐటియు మండల కార్యదర్శి జె.మోహన్ లు మాట్లాడారు. ఏ పార్టీలు అధికారంలో ఉన్నాయనే దానితో నిమిత్తం లేకుండా దళితులపై దాడుల పరంపర కొనసాగుతూనే ఉందన్నారు. జిల్లాలో 80 శాతం మంది దళితులు భూమిలేని నిరుపేదలుగా తమ రెక్కల కష్టంపై ఆధారపడి బతుకుతున్నారన్నారు. ఉన్న ప్రాంతంలో పని దొరకక, పని దొరికినా అక్కడ చూపుతున్న అవమానాన్ని భరించలేక వలసలు వెళుతున్న పరిస్థితి ఉందన్నారు. మండలంలో ఉన్న దళితులు తమ పిల్లలను సైతం చదువులకు దూరం చేసి తమతో పాటు తీసుకెళ్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ సాంఘిక అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయని, వాటిని రూపుమాపేందుకు అవసరమైన ఆర్థిక ప్రగతిని దళితులకు అందించడంలో ప్రభుత్వాలు విఫలం కాగా.. దళితులకు వచ్చే సంక్షేమ పథకాలను సైతం వారికి సంపూర్ణంగా దూరం చేశారన్నారు. యాత్ర గ్రామ గ్రామాన తిరుగుతున్నదని, సమస్యల పరిష్కారానికి 28న విజయవాడలో జరిగే మహా ఉద్యమానికి సిద్ధం కావాలని కోరారు. జాతాలో డప్పు కళాకారుల సంఘం మండల అధ్యక్షులు భగవంతు, నాయకులు సేశన్న, పెద్దయ్య, గోరంట్ల, ప్రకాష్, సుందర్రాజు, లోకరాజు, తిమ్మప్ప, మహేష్ పాల్గొన్నారు.



యాత్రను ప్రారంభించి మాట్లాడుతున్న ఎండి.ఆనంద్‌బాబు

**కర్నూలు కార్పొరేషన్ :** సమాజంలో ఉన్న నిమ్నవర్గాలకు ఆధిపత్య వర్గాలతో పాటు సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగానికి తూట్లు పొడవాలని చూస్తే, మీ రాజకీయాలకు తూట్లు పొడుస్తామని దళిత రక్షణ యాత్రలో పాల్గొన్న కెవిపిఎస్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం కెవిపిఎస్ కర్నూలు ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో జొహరాపురంలో దళిత రక్షణ యాత్ర చేపట్టారు. కెవిపిఎస్ కర్నూలు అధ్యక్షులు ఆర్ రమణ అధ్యక్షతన జరిగిన పాదయాత్ర కార్యక్రమాన్ని కెవిపిఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పాదయాత్ర సందర్భంగా వివిధ వీధులలో జరిగిన సభలను ఉద్దేశించి కెవిపిఎస్ కర్నూల్ ఓల్డ్ సిటీ కార్యదర్శి ఆంధ్ర గురుస్వామి, ఉపాధ్యక్షులు మారెళ్ళ విజయ్, ఎన్ జి కృష్ణ, డి విజయమ్మ మాట్లాడారు.



కర్నూలు నగరంలో దళిత రక్షణయాత్ర



తైక్వాండో క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

## టైక్వాండో క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

పెద్ద మార్కెట్ కెఎంసి పార్క్ సమీపంలో లక్ష్మి నరసింహ కళ్యాణ మండపం హాలులో టైక్వాండో క్రీడాకారులకు ప్రముఖగ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే రోజూ క్రీడా సాధన చేసి జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయిలో జాతీయస్థాయిలో సాధించిన క్రీడాకారులకు చదువుతోపాటు ప్రతి ఒక్కరూ క్రీడలలో సాధన చేయాలని తెలిపారు. ఆత్మ రక్షణ కోసం టైక్వాండో క్రీడా రోజు సమయం కేటాయించి శిక్షణ పొందాలని సూచించారు. క్రీడా సాధనతో క్రమశిక్షణ, ఆరోగ్యం , ఆత్మరక్షణకు తోడ్పడుతుందన్నారు. దాంతో పాటు చదువుల్లో కూడా చురుకుగా ఉండి అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారని చెప్పారు. క్రీడా సాధన చేయకపోతే మారిన ఆహారపు అలవాట్ల వలన బిపి, షుగర్ వంటివి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా జాయింట్ సెక్రెటరీ టి వెంకటేశ్వర్లు, హెచ్‌కె. వీరేష్, వీరేష్, కె. రోహిత్, అజయ్, ఎ.రోహిత్, టి.తిలక్, అఖిల్ టి.కృష్ణసాయి, నందిని, శ్రీలలిత, అశ్విని, ఉదయ్ కుమార్ మధుసూదన్, లక్కీ, బండారి, మల్లేష్ విశ్వాస్ పాల్గొన్నారు.

# రవీంద్ర లో ఓరియంటేషన్ డే

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాల , జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలు సంయుక్తంగా ఓరియంటేషన్ డే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య , కళాశాలల అడ్వైజర్ డాక్టర్ ఇఎస్. చక్రవర్తి పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ జివిఎం. మోహన్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. జి. పుల్లయ్య మాట్లాడుతూ నేటి రోజుల్లో మానవునికి డబ్బు, ఆధునిక హంగులు ఎక్కువయ్యాయన్నారు. విద్య ప్రాముఖ్యతను గుర్తించడం లేదన్నారు. ఏ వ్యక్తి అయినా విద్యలో నైపుణ్యం సంపాదిస్తే జీవితంలో గౌరవం లభిస్తుందన్నారు. ఇందుకు ఉదాహరణగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ,శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో ప్రపంచ దేశాలను గడగడలాడించిన క్షిపని పితామహుడు డాక్టర్ అబ్దుల్ కలాం జీవితాలను ఉదహరించారు. అనంతరం ఇఎస్. చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులు నిత్య పరిశోధకులుగా ఉంటూ పరిశోధనా పత్రాలు ప్రచురించగలగాలన్నారు. విద్యార్థుల మేధో మదనమునకు అధ్యాపకబృందం నిరంతరం తోడ్పడుతుందన్నారన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పుస్తకాల ద్వారా వచ్చేది కాదన్నారు. నిరంతర పరిశీలన, పరిశోధన ఎవరికైతే ఉంటుందో వారు తప్పక గొప్ప శాస్త్రవేత్తలు కావడానికి అవకాశం ఉంటుందన్నారన్నారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ సి. శ్రీనివాసరావు, డాక్టర్ కెయి.శ్రీనివాసమూర్తి, కళాశాలల వివిధ డీన్లు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఓరియెంటేషన్ డేను ప్రారంభిస్తున్న జి.పుల్లయ్య, అతిథులు

## ఆత్మ హత్యల నివారణకు అవగాహన

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

కర్నూలు బి క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల లో ప్రిన్సిపల్ ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మ హత్యల నివారణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ బి.రమేష్ బాబు ముఖ్య అతిధిగా వచ్చారు. ఆత్మ హత్యల కు కారణాలు , నివారణ అంశాలను వివరిస్తూ విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్ర లేఖనం , వకృత్వ పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ రామకృష్ణ, కృష్ణ మోహన్, విజయశేఖర్, మల్లికార్జున, నాగమోహన్, గిరిజారాణి , సుజాత, సోమేష్, పార్థసారథి పటేల్ , నాన్ టీచింగ్ సిబ్బంది ,విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు

## సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలి

**- తాగునీటి సమస్య తీర్చండి - మంత్రి గుమ్మనూరుకు ప్రజల విన్నపం**

**ప్రజాశక్తి - దేవనకొండ**


లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు

తాగునీటి సమస్యను పరిష్కరించి, సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌ను కుంకనూరు గ్రామస్తులు కోరారు. ఆదివారం ఆ గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. మంత్రి గుమ్మనూరు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని మాల కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేవని ప్రజలు విన్నవించారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ... 'గడపగడపకు మన ప్రభుత్వం'లో భాగంగా సచివాలయానికి మంజూరయ్యే రూ.20 లక్షలతో, మండల అభివృద్ధి గ్రాంటుతో గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలు చేపడతామని తెలిపారు. రూరల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ కింద ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన తక్షణమే ఇంటింటికీ కుళాయి నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. గత టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్‌మెంట్‌లో అవినీతి, అక్రమాలకు పాల్పడినందున సిఐడి అధికారులు ఆయనపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారన్నారు. ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ ఇద్రుస్ బాషా, ఎఒ సురేష్ బాబు, పిఆర్ ఎఇ ఉదయ్ కుమార్, వైఎస్ఆర్ క్రాంతి పథం సిసి నరసన్న, మంత్రి సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు, జడ్‌పిటిసి కిట్టు, వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, సర్పంచి వీరమ్మ, వైసిపి నాయకులు దివాకర్ నాయుడు, ప్రేమ్ నాథ్ రెడ్డి, వెలమకూరు రామచంద్ర, పల్లెదొడ్డి చంద్రన్న, మల్లికార్జున రెడ్డి, పరమేష్, జగదీష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో నిర్లక్ష్యం

**- 60 వేల ఎకరాలకు సాగునీరందించాలి**

**- హంద్రీ నీవాకు గుండ్లకొండ దగ్గర స్లూయిజ్ ఏర్పాటు చేసి కోటకొండ వరకు సాగునీరివ్వాలి - రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ**

**ప్రజాశక్తి - దేవనకొండ**

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందని నాయకులు విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలకు నిధులు కేటాయించకపోవడంతో రైతులకు సాగు, తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. హంద్రీనీవా ద్వారా గుండ్లకొండ వద్ద స్లూయిజ్ ఏర్పాటు చేసి కోటకొండ, మాచాపురం వరకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివారం రైతు సంఘం ఆధ్వర్యంలో పి.కోటకొండ గ్రామంలో పాదయాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర బేతపల్లి, చెల్లెల చెలిమల, బంటుపల్లి, గుడిమిరాళ్ల మీదుగా గుండ్లకొండకు చేరింది. రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రైతు సంఘం మండల కార్యదర్శి సూరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాలకులు, ప్రజా ప్రతినిధుల చిత్తశుద్ధి లోపం వల్ల ప్రతేడాది వర్షభావ పరిస్థితులతో కరువు ఏర్పడి రైతులు పెట్టిన పెట్టుబడులు రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఆగస్టు నెలలో వర్షాలు కరువుతో రైతుల పంటలు దెబ్బతిన్నాయన్నారు. మండలంలో హంద్రీనీవా పెద్ద కాలువ ద్వారా నీరు పోతున్నాయని, ఒడిసిపట్టి మండలంలోని ప్రతి ఎకరాకూ నీరిచ్చే అవకాశం ఉందని తెలిపారు. పాలకుల చిత్తశుద్ధి లోపం, బాధ్యతరాహిత్యం మండల రైతులకు శాపంగా మారిందని మండిపడ్డారు. గుండ్లకొండ దగ్గర హంద్రీ నీవా కాలువకు స్లూయిజ్ ఏర్పాటు చేయడం ద్వారా మండలంలోని గుండ్లకొండ, గుడిమిరాళ్ల, బంటుపల్లి, చెల్లెల చెలిమిల, బేతపల్లి, బండపల్లి, కోటకొండ, వెంకటాపురం, పల్లెదొడ్డి, మాచాపురం వరకు సాగునీరు ఇవ్వడానికి అవకాశం ఉందని


పాదయాత్ర చేపడుతున్న నాయకులు

తెలిపారు. వెంటనే ప్రభుత్వం గుండ్లకొండ దగ్గర స్లూయిజ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నేలతలమరి చెరువు, గుండ్లకొండ బానకుంట, గుడిమిరాళ్ల నిమ్మలబండ చెరువు, తుమ్మలచెరువు, బంటుపల్లి కుంట, చెల్లెల చెలిమిల చెరువు, బండపల్లి చెరువు, కోటకొండ చిన్నోని చెరువు, మాచాపురం పెద్ద చెరువు, బురకుంట చెరువుకు హంద్రీనీవా ద్వారా నీళ్ల మళ్లించడం ద్వారా ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. హంద్రీనీవా ద్వారా మండలంలో 46 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని అధికారికంగా ఉన్నప్పటికీ పిల్ల కాలువల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నందున రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయినప్పటికీ నిధుల కేటాయింపు జరగకపోవడంతో పిల్ల కాలువ నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ఈ పాదయాత్రకు జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహేంద్ర నాయుడు మద్దతు తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధి కమిటీ నాయకులు గౌస్‌దేశాయి, రైతుసంఘం, ప్రజా సంఘాల నాయకులు అశోక్, శ్రీరాములు, యూసుఫ్ బాష, బడే సాబ్, బజారి, ఓంకార్, సుధాకర్, శ్రీనివాసులు, మహేంద్ర, సుంకన్న పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

## ఐలమ్మ ఆశయ సాధనకు కృషి

**- ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు ముక్కన్న**

**ప్రజాశక్తి - ఆదోని**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ, విద్యుత్ పోరాటంలో అమరుడైన సత్తనపల్లి రామకృష్ణ ఆశయ సాధనకు కృషి చేద్దామని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు ముక్కన్న, ఉద్యోగ సంఘం నాయకులు నాగరాజు, సిద్ధప్ప కోరారు. ఆదివారం పట్టణంలోని మరాఠ గేరిలో మడివల్ల మాచయ్య స్వామి దేవాలయంలో రామన్న అధ్యక్షతన వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, వెట్టి చాకిరి విముక్తి కోసం, భూమి కోసం, సాయుధ రైతాంగ పోరాటంలో తన వంతు పాత్ర పోషించిన వీర వనిత చాకలి ఐలమ్మను ఈతరం యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సత్తెనపల్లి రామకృష్ణ భూమి కోసం, భుక్తి కోసం, నిజాం నవాబులకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. 2000 సంవత్సరం ఆగస్టు 28న విద్యుత్ చార్జీలకు నిరసనగా ఉమ్మడి రాజధాని హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో జరిగిన కాల్పుల్లో గాయపడి సెప్టెంబర్ 8న సత్తనపల్లి రామకృష్ణ మృతి చెందారని చెప్పారు. రజక సంఘం పట్టణ అధ్యక్షులు ఈరన్న, నాయకులు ఉరుకుందు, నాగేష్, వెంకటేశులు, మల్లప్ప, ఉద్యోగ సంఘం నాయకులు గోవిందప్ప, నరసింహ రాజు, రజక సంఘం పట్టణ నాయకులు, నాగరాజు, ఎర్ర స్వామి, వెంకటేశ్వర్లు, నాగేష్ పాల్గొన్నారు.

## పాఠశాలల పరిరక్షణకు ఉద్యమం

**- ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంజుల, భాను మూర్తి**

**ప్రజాశక్తి - మంత్రాలయం**

ప్రభుత్వం ఆవలంబిస్తున్న విద్యారంగ వ్యతిరేక విధానాల వల్ల ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారబోతోందని, దీనిని ఎదుర్కోవడం కోసం ఉపాధ్యాయులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.మంజుల, కె.భానుమూర్తి కోరారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండోరోజు ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యయన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యాశాఖలో వచ్చిన 117 జిఒ ద్వారా రాష్ట్రంలోని అనేక పాఠశాలలోని 3, 4, 5వ తరగతులను ఉన్నతా పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల వేలాది ఉపాధ్యాయ పోస్టులు మిగులు పడ్డాయని తెలిపారు. రెండు మాధ్యమాలకు బదులు ఒకే మాధ్యమం వల్ల కూడా వేలాది పోస్టులు మిగులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. విద్యారంగంలో నాణ్యత లోపించిందని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో 1, 2వ తరగతుల్లో విద్యార్థులు లేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. మూడు నెలలు గడిచినా నేటికీ ఉపాధ్యాయుల జీతాలు చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం కోసం ప్రిన్సిపల్ సెక్రటరీ పాఠశాలల తనిఖీ పేరుతో వస్తూ ప్రభుత్వ పాఠశాలల, ఉపాధ్యాయుల ప్రతిష్ట దిగజార్చే విధంగా వీడియోల ద్వారా ప్రచారం చేస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల పట్ల విశ్వాసం పోయి, ప్రయివేట్ పాఠశాలలకు మేలు చేకూర్చే విధంగా ఉందని తెలిపారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అశోక్ కుమార్, ఎ.శ్యాంసుందర్ రెడ్డి, టి.త్రినాథ, కె.నాగ సోమేశ్వరమ్మ, కార్యదర్శులు డి.సరస్వతి, సయ్యద్ చాంద్ బాష, బి.రఘుబాబు, ఎస్.రవికుమార్, ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు షేక్ జిలాని, పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ, వరప్రసాద్, కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎం.రంగన్న, ప్రధాన కార్యదర్శి బి.నాగరాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంజుల

### అవినీతి సొమ్ముతో

## ఎమ్మెల్యేలను కొన్న చరిత్ర బాబుది

**- ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి - రూ.2.5 కోట్లతో జల జీవన మిషన్ పనులకు భూమి పూజ**

**ప్రజాశక్తి - గోనెగండ్ల**


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అవినీతి సొమ్ముతో 23 మంది ఎమ్మెల్యేలను కొన్న చరిత్ర చంద్రబాబు నాయుడుదని ఎమ్మెల్సీ, వైసిపి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య, జడ్‌పి ఛైర్మన్ పాపిరెడ్డి విమర్శించారు. ఆదివారం మండలంలోని హెచ్.కైరవాడీ, గోనెగండ్లలోవివిధ కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. గోనెగండ్లలో రూ.2.5 కోట్లతో చేపట్టనున్న ప్రధానమంత్రి జలజీవన్ మిషన్ పనులకు భూమి పూజ చేశారు. వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, ఎంపిపి నసురుద్దీన్, సర్పంచి హైమావతి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సాంబయ్య, ఎఇ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం స్థానిక బాష ఫంక్షన్ హాలులో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన వైసిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చంద్రబాబు సత్య హరిశ్చంద్రునికి వారసుడు కాదని విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిధుల్లో రూ.వందల కోట్లను అవినీతితో నొక్కేశారని, తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదని అన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, వైస్ ఎంపిపి వెంకటరామిరెడ్డి, సింగిల్‌విండో ప్రెసిడెంట్ తిరుమలరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ మన్సూర్, మాజీ కో ఆప్షన్ సభ్యులు బందే నవాజ్, మండల కన్వీనర్ దొరబాబు నాయుడు, కాశిరెడ్డి, భాస్కర్ రెడ్డి, బగిలి ఉస్మాన్, రఫీ, పద్మనాభం పాల్గొన్నారు.

## హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి : సిఐటియు

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

హమాలీ కార్మికులకు సమగ్రమైన వేతన చట్టం తీసుకు రావాలని సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు జె.రామాంజనేయులు, బి.వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పెద్దతుంబలం గ్రామంలో హమాలీ కార్మికుల సమావేశం యూనియన్ అధ్యక్షులు రామదాసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హమాలీ కార్మికులు దుర్భరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. హమాలీ కార్మికులు వయస్సు ఉన్నప్పుడు కష్టపడి పని చేసి కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. వయస్సు మీద పడిన తర్వాత వృద్ధాప్యంలో తీవ్రమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమగ్రమైన చట్టం తీసుకు రావాలని కోరారు. ప్రభుత్వం హమాలీ కార్మికులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ప్రభుత్వమే వారికి వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వయస్సు మీద పడిన తర్వాత వారికి కనీస పింఛను వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమస్యలు పరిష్కారం కావాలంటే వారికి సంక్షేమ బోర్డు అవసరమని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ప్రభుత్వం వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అల్లప్ప, నరసింహులు, నాగిరెడ్డి, గోవిందు, రామన్న పాల్గొన్నారు.

# వైద్యులు, ఆస్పత్రుల సమస్యలు పరిష్కరించాలి

**- ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు రవికృష్ణ**

**ప్రజాశక్తి - ఆదోని**

వైద్యులు, ఆస్పత్రుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని మెట్రో ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఐఎంఎ అంటే ప్రయివేట్ వైద్యుల సంఘం అనే అపోహ ఉందని, తమ సంఘం సభ్యులు ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో, వైద్య కళాశాలలో సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో ఆస్పత్రులపై, వైద్యులపై భౌతిక దాడులు పెరిగి పోతున్నాయని చెప్పారు. వాటిని నివారించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకు రావాలని కోరారు. ఆస్పత్రుల్లో రోగులు చనిపోతే చికిత్సల్లో లోపాలపై వైద్యులపై వైద్య నిర్లక్ష్యం కేసులు నమోదు చేసే సమయంలో సుప్రీంకోర్టు తీర్పులు పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. ముగ్గురు వైద్య నిపుణుల కమిటీ ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని నిర్ధారించిన తర్వాతే కేసులు నమోదు చేయాలన్నారు. 15 మీటర్లలోపు ఆస్పత్రులకు రాష్ట్ర అగ్నిమాపక చట్టం ప్రకారం అవసరం లేదని, ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ సమయంలో వైద్య, ఆరోగ్య శాఖ ఈ నిరభ్యంతర


మాట్లాడుతున్న డాక్టర్ రవికృష్ణ

పత్రం తప్పనిసరి చేస్తున్నారని, ఆ నిబంధనను సవరించాలని కోరారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్రంలో ఉన్న 98 ఐఎంఎ శాఖల ద్వారా వైద్యులకు నిరంతర వైద్య విద్య కార్యక్రమాలు నిర్వహించి వారికి ఆధునిక వైద్య విజ్ఞాన శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా పేదలకు ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన సదస్సులు, విద్యా సంస్థల్లో ఆరోగ్య సదస్సులు, కౌమార బాలికల ఆరోగ్య పరిరక్షణ కోసం రక్తహీనత నిర్ధారణ వంటి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఐఎం ఆదోని శాఖ అధ్యక్షులు డాక్టర్ ఉషా, గోపీనాథ్, కార్యదర్శి డాక్టర్ కిరణ్, సీనియర్ వైద్యులు డాక్టర్ గోపీనాథ్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ పనిల్, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ హరీష్, ఐఎంఎ నాయకులు డాక్టర్ రామ వరప్రసాద్ ఉన్నారు.

### చంద్రబాబు నాయుడు అరెస్టుతో

## ఆగిన మహిళ గుండె

**ప్రజాశక్తి - కౌతాళం**

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు కావడం, ఆ దృశ్యాలను చూసి మహిళ గుండె ఆగిన సంఘటన ఆదివారం మండలంలోని వల్లూరు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు... మండలంలోని వల్లూరు గ్రామంలో వడ్డే ఈరమ్మ (45) రోజూలాగే శనివారం కూలి పనికి వెళ్లి ఇంట్లో టివి చూస్తున్నారు. చంద్రబాబు నాయుడును అరెస్టు చేశారని విన్న వెంటనే వడ్డే ఈరమ్మ గుండె ఆగిపోయింది. విషయం తెలుసుకున్న తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్ హుటాహుటిన వడ్డే ఈరమ్మ ఇంటికి వెళ్లి, ఆమె మృతదేహాన్ని చూసి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు అరెస్టు కావడాన్ని టివిలో చూస్తూ వడ్డే ఈరమ్మ గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని తెలిపారు. వడ్డే ఈరమ్మ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. టిడిపి తరఫున వడ్డే ఈరమ్మ అంత్యక్రియలకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

## కరువు సహాయక చర్యలు చేపట్టండి : రైతుసంఘం

**ప్రజాశక్తి - కౌతాళం**

మండలంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య డిమాండ్ చేశారు. ఆదివారం వల్లూరు, గుడికంబాలి, హాల్వి తదితర గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మేలో కురిసిన భారీ వర్షాలకు రైతులు చాలామంది ముందస్తు విత్తనాలు వేశారని తెలిపారు. జులై, ఆగస్టులో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పంటలు ఎండుముఖం పట్టాయని చెప్పారు. పంట ఒక అడుగుకే పత్తి పూలు కాస్తున్నాయని, దిగుబడి ఏమాత్రం వస్తుందో వ్యవసాయ అధికారులు చెప్పాలని అన్నారు. సామాన్య రైతుల పరిస్థితి ఇలా ఉంటే కౌలు రైతుల పరిస్థితి మరి ఘోరంగా ఉందన్నారు. ఎకరాకు రూ.10 వేల ప్రకారం కౌలు చేసే రైతులు కౌలు డబ్బులు ఎలా చెల్లించాలో అర్థం కాక దిగులు చెందుతున్నారన్నారు. ఒక రైతు 5 నుంచి 10 ఎకరాలు కౌలు చేస్తే రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు చెల్లించాల్సి ఉందన్నారు. కరువు మండలంగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు వీరన్న, ఎల్లప్ప, ఉల్లిగయ్య పాల్గొన్నారు.

## నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటాం : తిక్కారెడ్డి

**ప్రజాశక్తి - మంత్రాలయం**

నియోజకవర్గంలోని టిడిపి నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాలకుర్తి తిక్కారెడ్డి భరోసా ఇచ్చారు. స్థానిక టిడిపి దళిత నాయకులు మడ్రి పౌలు అనారోగ్యంతో కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. ఆదివారం టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామితో కలిసి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఉండగా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించిన ఆయన మళ్లీ రూ.20 వేల నగదును పన్నగ వెంకటేష్ స్వామి చేతుల మీదుగా అందజేశారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎంపిటిసి వెంకటేష్, టిడిపి నాయకులు హండే హనుమంతు, వట్టేప్ప గారి నరసింహ, ఏబు, పేతూరు సుధాకర్, శివ, శ్యామ్సన్ ఉన్నారు.

## 'బాబు అరెస్టు అప్రజాస్వామికం'

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అరెస్టు అప్రజాస్వామికమని టిడిపి నాయకులు తెలిపారు. ఆదివారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక సోమప్ప సర్కిల్‌లో నిరాహార దీక్షలు చేపట్టారు. కళ్లకు నల్ల గంతలు కట్టుకొని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ దయాసాగర్, కొండయ్య చౌదరి, సుందర్ రాజు, కలీముల్లా, రాందాస్ గౌడ్, తురేగల్ నజీర్ అహ్మద్, రంగస్వామి గౌడ్, గురు రాజ్ దేశాయి, డీలర్ మహబూబ్ బాష, మల్లికార్జున, తిరుపతయ్య, ఖాసీం వలీ, రామకృష్ణ, మిఠాయి నరసింహులు, అడ్వకేట్ చంద్రశేఖర్, అడ్వకేట్ వెంకటేష్ మాట్లాడారు. చంద్రబాబుపై వైసిపి ప్రభుత్వం పైశాచికంగా కేసులు పెట్టిందన్నారు. దీక్షలను సాయంత్రం మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కొండయ్య చౌదరి పండ్ల రసం అందజేసి విరమింపజేశారు.

## బందోబస్తు ముమ్మరం : ఎస్ఐ

**ప్రజాశక్తి - చిప్పగిరి**

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును కోర్టు రిమాండ్‌కు తరలించడంతో టిడిపి శ్రేణులు అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ఎ.రమేష్ బాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు చిప్పగిరితో పాటు అనేక గ్రామాల్లో పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. పోలీసులు పాల్గొన్నారు.

## స్నేహితుని కుటుంబానికి ఆర్థికసాయం


**ప్రజాశక్తి - ఆదోని**

స్నేహితుడు చనిపోవడంతో ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి తాము ఉన్నామని చిన్ననాటి స్నేహితులు భరోసా కల్పించారు. ఆదోని పట్టణంలోని వైఎంకె హై స్కూలు 2019-20 పదో తరగతి బ్యాచి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. అంతకుముందు చదువు నేర్పించిన గురువులకు పూలమాల, శాలువా వేసి సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులు శరత్ కుమార్ రెడ్డి, మల్లికార్జున మాట్లాడారు. చిన్న నాటి స్నేహితుడు రాఘవేంద్ర మృతి చెందడం దురదృష్టకరమని తెలిపారు. అతని కుటుంబానికి రూ.60 వేల ఆర్థిక సహాయం మృతుని భార్య అరుణకు అందించామన్నారు. స్నేహితులు బాబు, మహేష్, గురు, ఆసిఫ్, రజని, ప్రియా, శ్వేత, రాణి, సువర్ణ ఉన్నారు.


# అక్రమ కేసులు పెట్టి ఆనంద పడుతున్న వైసిపి

**ప్రజాశక్తి-ఆలూరు**

అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్ర ప్రజలపైనా, ప్రతిపక్ష నాయకులపైనా, కార్యకర్తలపైనా, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా అక్రమ కేసులు పెట్టి ఆనంద పడుతున్న సైకో జగన్మోహన్ రెడ్డి అని టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు, కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి మండిపడ్డారు. ఆదివారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆధ్వర్యంలో ఆలూరు పాతబస్టాండ్‌లో నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, సుజాతమ్మ మాట్లాడారు. 'ఒక్కఛాన్స్' పేరుతో అధికారం చేపట్టిన జగన్ పాలన చూసిన ప్రజలు ఈ పాలన మాకొద్దంటున్నారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిని గాలికొదిలేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ సైకోగా మారారని విమర్శించారు. చంద్రబాబు 'భవిష్యత్తుకు గ్యారెంటీ సభలకు, లోకేష్ పాదయాత్రలకు జన నీరాజనాలు చూసి ఓర్వలేకనే కుట్ర పన్ని అక్రమ కేసులతో అరెస్టు చేయించారని తెలిపారు. సి.నారాయణరెడ్డి, కురువ జయరామ్, సులక్షణ రెడ్డి పాల్గొన్నారు. **మంత్రాలయం** రాఘవేంద్ర సర్కిల్‌లో సామూహిక రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. టిడిపి మండల అధ్యక్షులు పన్నగ స్వామి అధ్యక్షత వహించారు. టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి


ఆలూరులో మాట్లాడుతున్న కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి


మాట్లాడారు. రాష్ట్రంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు పెరుగుతున్న ప్రజాదరణను తట్టుకోలేక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం రాక్షస పాలనకు నిదర్శనమని విమర్శించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు యువత కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, గోపాల్ స్వామి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప, ధని, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు అడివప్ప గౌడ్, వెంకటపతి రాజు, కోట్రేష్ గౌడ్, ఎల్లారెడ్డి, చావిడి వెంకటేష్, బాబురావు, జ్ఞానేష్, భరద్వాజ్ శెట్ట, కృష్ణారెడ్డి, పెద్దకడబూరు మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, బీసీ సీనియర్ నాయకులు వక్రాని వెంకటేశ్వర్లు, నాడిగేని అయ్యన్న, బీసీ సెల్ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, అశోక రెడ్డి, తెలుగు యువత జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయ రామిరెడ్డి, ఆర్‌టిఎస్ కన్వీనర్ దశరథ రాముడు, తెలుగు యువత నాడిగేని మహదేవ్, మైనారిటీ నియోజకవర్గ అధ్యక్షులు టిప్పు సుల్తాన్, ఉసేని, అబ్దుల్, వట్టేప్ప గారి నరసింహులు, మేకల నరసింహులు, ఎంపిటిసి వెంకటేష్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ఏబు, రాజాబాబు, బొగ్గుల నరసన్న, వీరేష్, శివ పాల్గొన్నారు. టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి, మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామిలు


మంత్రాలయంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

నిమ్మరసం ఇచ్చి సామూహిక నిరాహార దీక్ష విరమింపజేశారు. **ఆదోని**లోని ఎన్‌టిఆర్ విగ్రహం ముందు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు మాట్లాడారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి బదులు రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. టిడిపి జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, నాయకులు రంగస్వామి నాయుడు, రామస్వామి, బుద్ధారెడ్డి, వాల్మీకి వెంకటేష్, కృష్ణారెడ్డి, మారుతి నాయుడు, రామాంజనేయులు, వీరేష్ కుమారి, సాధిక బేగం, శ్రీదేవి, ఫక్రుద్దీన్, శివప్ప, వెంకటేష్ చౌదరి, బాలాజీ, చాంద్, బాష, శాంతి, మల్లి, మల్లికార్జున ఉన్నారు.

**అంబేద్కర్ విగ్రహం ముందు మౌన దీక్ష**

చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు నల్లబ్యాడ్జి ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చంద్రబాబు బేషరతుగా బయటకు వస్తారని, ఆయన నిజాయితీపరుడని కొనియాడారు. నాయకులు ఫక్రుద్దీన్, షేక్షావలీ, సోమశేఖర్ రెడ్డి, మల్లేశప్ప ఉన్నారు.



ఆదోనిలో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

## బాబుపై కక్ష సాధింపు చర్యలు తగవు

**- టిడిపి ఆలూరు మాజీ ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్**

**ప్రజాశక్తి-ఆలూరు**

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని టిడిపి ఆలూరు మాజీ ఇన్‌ఛార్జీ వీర భద్ర గౌడ్ తెలిపారు. ఆదివారం ఆలూరులోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధిపై లేని ఆత్రుత ప్రతిపక్ష నేతలను, చంద్రబాబును లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తోందని విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు పేరు లేకున్నా సిఐడి అధికారులు ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రిని అరెస్టు చేసే ముందు గవర్నర్ అనుమతి తీసుకొని నోటీసు ఇవ్వాలన్నారు. అలాంటి నిబంధనలు పాటించకుండా జగన్ డైరెక్షన్‌లో అధికారులు, పోలీసులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు అరెస్టు రాష్ట్ర ప్రజల్లో సానుభూతిని కలిగించిందని చెప్పారు. జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్పి జగన్ మళ్లీ జైలుకు వెళ్లేలా చేస్తారన్నారు. అంతకుముందు దేవరగట్టులోని మాల మల్లేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించి చంద్రబాబు నిర్దోషిగా బయటికి రావాలని 101 టెంకాయలు కొట్టారు.



## ఆదరణను ఓర్వలేకనే బాబు అరెస్టు

**- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ**

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

టిడిపి అధినేత చంద్రబాబుకు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే అరెస్టు చేయించారని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ తెలిపారు. ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్ష నేత చంద్రబాబును ఇబ్బంది పెట్టడమే ముఖ్యమంత్రి జగన్‌కు పనిగా మారిందని తెలిపారు. వైసిపి నేతలు ఆరోపిస్తున్నట్లు చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులకు సంబంధం లేని విషయంలో వైసిపి కుట్ర పన్ని అరెస్టు చేయించిందని చెప్పారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, వడ్డెమాన్ గోపాల్, మాజీ ఎంపిపి మురళీ, బాబురావు, నాగేంద్ర, భారత్, వీరేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గుడిసె కృష్ణమ్మ

## అరెస్టుతో బాబుకు పెరిగిన ప్రజాదరణ

**- కేంద్ర మాజీ మంత్రి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల**

**ప్రజాశక్తి - ఆదోని**


అక్రమ అరెస్టుతో చంద్రబాబు నాయుడుకు ప్రజల్లో విపరీతమైన ఆదరణ పెరిగిందని టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు, కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని రోషన్ గార్డెన్‌లో టిడిపి నాయకులు, మాజీ కౌన్సిలర్ రామచంద్ర కుమారుని వివాహ వేడుకలకు హాజరయ్యారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో రాష్ట్ర అభివృద్ధి కోసం పని చేశారన్నారు. అలాంటి వ్యక్తిని అంతం చేయాలని, రాజ్యాధికారం లేకుండా చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భావించినా అతని తరం కాదని తెలిపారు. అప్పట్లోనే జగన్ తాత రాజారెడ్డి, తండ్రి రాజశేఖర్ రెడ్డి ఎన్నో ఎత్తులు వేశారని, వాటన్నింటిని చంద్రబాబు చిత్తు చేశారని చెప్పారు. ప్రజలు మేల్కొన్నారని, టిడిపికి అధికారం ఖాయమని స్పష్టం చేశారు. పెద్ద మసీదు కమిటీ ఛైర్మన్ సౌదీ రావుఫ్, మాజీ కౌన్సిలర్ రామచంద్ర, నాయకులు సోమశేఖర్ రెడ్డి, షేక్షావలీ, పర్ల నాయకులు గోపాల్ రెడ్డి, కన్నె జగదీష్, ఎమ్‌డి.బసవరాజు స్వామి ఉన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

**- ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆనంద్ చైతన్య**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

ఎస్సీ వర్గీకరణకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ జి.ఆనంద్ చైతన్య మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 18 నుంచి 22 వరకు జరిగే పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన దీక్షలు ఈనెల 10 నుంచి 22 వరకు ఎమ్మిగనూరుతో పాటు అన్ని మండలాల్లో కొనసాగుతాయని తెలిపారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బిజెపి అధికారం చేపట్టి పదేళ్లు గడుస్తున్నా హామీని విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు కడప ఎంపీగా ఉన్న జగన్ ఎస్సీ వర్గీకరణను సమర్థించి కేంద్రానికి లేఖ రాశారని, నేడు పట్టించుకోకపోవడం మాదిగలను మోసం చేయడమేనని మండిపడ్డారు. ఈ నెలలో జరిగే పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేలా అన్ని రాజకీయ పార్టీలూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలని కోరారు. ఎస్సీ వర్గీకరణను విస్మరించే పార్టీలకు 2024 ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు హాలహర్వి ఏసన్న మాదిగ, ప్రభాకర్ మాదిగ, ప్రసాద్ మాదిగ, దేవరాజు మాదిగ మొదటి రోజు దీక్షలో కూర్చున్నారు. మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) నాయకులు దివాకర్ చైతన్య మాదిగ, ప్రకాష్ మాదిగ, పౌలు మాదిగ, సంజులు, టిడిపి ఎస్సీ సెల్ నాయకులు హాలహర్వి దావీదు, ముగతి బాలరాజు పాల్గొన్నారు.





న్యాయమూర్తి దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఇఓ లవన్న

# సగమే సాగు



## - సాధారణ సాగులో 56 శాతమే పంటలు - లోటు వర్షపాతమే కారణం

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

**నంద్యాల జిల్లాలో సాగు ఆశించిన రీతిలో ముందుకు సాగలేదు. లోటు వర్షపాతంతో విత్తనాలు వేసేందుకు అన్నదాతలు అడుగులు ముందుకు వేయలేదు. వరుసగా నష్టాలు మూటగట్టు కుంటుండటంతో విత్తనం విత్తాలా వద్దా అనే సందేహంతో సాధారణ సాగులో 56 శాతమే పంటలను సాగు చేశారు...**

వ్యవసాయమే ప్రధానంగా ఉన్న జిల్లాల్లో నంద్యాల జిల్లా ఒకటి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ సాధారణ సాగులో కేవలం 56 శాతం మాత్రమే విత్తనాలు వేశారు. జిల్లాలో మొత్తం సాధారణ సాగు 5,93,482.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 3,36,165 ఎకరాల్లో మాత్రమే రైతులు విత్తనాలు వేశారు. వర్షాలు ఆశించిన రీతిలో పడకపోవడంతో విత్తనం విత్తేందుకు రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రధాన పంటగా ఉండే వరి సాధారణ సాగు 1,76,315 ఎకరాలు కాగా కేవలం 45,062.5 ఎకరాల్లో మాత్రమే ఇప్పటి వరకూ సాగు చేశారు. మొక్కజొన్న సాధారణ సాగు 1,04,745 ఎకరాలు కాగా 86,125 ఎకరాల్లో విత్తనాలు విత్తారు. కంది సాధారణ సాగు 93,877.5 ఎకరాలు కాగా 73,680 ఎకరాల్లో, మినుము సాధారణ సాగు 16,982.5 ఎకరాలు కాగా 12,387.5 ఎకరాల్లో సాగు చేశారు. వేరుశనగ సాధారణ సాగు 39,510 ఎకరాలు కాగా 21,050 ఎకరాల్లో సాగైంది. జిల్లా వ్యాప్తంగా పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 63,965 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 23,387.5 ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఉల్లి సాధారణ సాగు 10,182.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 4,997.5 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో మిరప సాధారణ సాగు విస్తీర్ణం 25,010 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ కేవలం 13,050 ఎకరాల్లో సాగైంది. గతేడాది మిర్చి పంట తెగుళ్లతో భారీగా నష్టాలు మూటగట్టుకోవడంతో రైతులు ఈ ఏడాది మిరప సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. పసుపు సాధారణ సాగు 2,737.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 435 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు.

**చిరు ధాన్యాలపైనా ప్రభావం :** లోటు వర్షపాతం ప్రభావం చిరు ధాన్యాల సాగు పైనా పడింది. కొర్ర సాధారణ సాగు 4,860 ఎకరాలు కాగా కేవలం 2,895 ఎకరాల్లో సాగు చేశారు. వర్షం అవసరమైన రీతిలో పడకపోవడమే సాగు ముందుకు సాగకుండా పోవడానికి కారణమని పలువురు చెబుతున్నారు.

**సాగు శాతాల్లో...**

| పంట | సాగైన శాతం |
|---|---|
| వరి | 26 |
| మొక్కజొన్న | 82 |
| కొర్ర | 60 |
| కంది | 78 |
| మినుము | 73 |
| వేరుశనగ | 53 |
| పత్తి | 36 |
| మిరప | 54 |
| ఉల్లి | 49 |
| **మొత్తం** | **56** |

# శ్రీశైలంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

**ప్రజాశక్తి - శ్రీశైలం**

భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా కుటుంబ సమేతంగా స్వామిఅమ్మవార్లను ఆదివారం దర్శిం చుకున్నారు. శనివారం రాత్రి శ్రీశైలం చేరుకున్న వీరికి దేవస్థానం అతిథి గృహం భ్రమరాంబ అతిథి గృహం వద్ద పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. వీరివెంట ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి. శేషసాయి, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఎన్. శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూ అధికారి బి. పుల్లయ్య తదితరులు ఆలయం వద్దకు చేరుకున్నారు. వేకువజామున ఆలయం వద్దకు చేరుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తికి దేవస్థానం కార్యనిర్వహణా ధికారి ఎస్. లవన్న, అర్చకస్వాములు, వేదపండితులు ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా వీరు రత్నగర్భగణపతిస్వామి వారిని దర్శించు కున్నారు. అనంతరం శ్రీ మల్లికార్జునస్వామి వారిని దర్శించుకుని పుజలు నిర్వహించారు. తదుపరి మల్లికాగుండంలో ప్రతిబింబించే ఆలయ విమాన గోపురాన్ని దర్శించుకున్నారు. అనంతరం శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవార్లకు కుంకుమార్చన జరిపించుకున్నారు. తరువాత సుప్రీంకోర్టు న్యాయమూర్తి వారికి అమ్మ వారి ఆలయం ఆశీర్వచనం మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేయగా శేషవస్త్రాలను, ప్రసాదాలు, స్వామిఅమ్మవార్ల జ్ఞాపికను దేవస్థానం అధికారి లవన్న అందజేశారు.



చాకలి ఐలమ్మ రామకృష్ణ నివాళులర్పిస్తున్న నాయకులు

# చంద్రబాబు అరెస్టుపై వెల్లువెత్తిన నిరసన దీక్షలు

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా ఆదివారం నంద్యాల జిల్లాలో నిరసన దీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని తమ నిరసనను తెలిపారు. అందులో భాగంగా నంద్యాల జిల్లా కేంద్రంలోని ఖలీల్ థియేటర్ ప్రాంగణంలో రిలే నిరాహార దీక్షలు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ఆధ్వర్యంలో జరిగాయి. దీక్షల్లో టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ దీక్షలను తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు ఎన్ఎండి ఫరూక్ ప్రారంభించారు. ఈ దీక్షలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మె ల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవి సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఏవి ప్రసాద్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, ప్రముఖ నాయకులు తాతి రెడ్డి తులసి రెడ్డి కౌన్సిలర్లు జైనబి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్, భూమా బ్రహ్మానందరెడ్డిలు మాట్లా డుతూ ప్రజల్లో మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే రాష్ట్ర ప్రభుత్వం అరెస్ట్ చేసిందని ఆరోపించారు. చంద్రబాబును అరెస్ట్ చేసినంత మాత్రాన టిడిపి కార్యకర్తలు, నాయకులు భయపడతారని అనుకుంటే అది వారి భ్రమేనని, రెట్టింపు ఉత్సాహంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు పని చేస్తారన్నారు. టిడిపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షలను భూమా బ్రహ్మానందరెడ్డి, ఫరూక్, ఏవిలు పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు రామచంద్రరావు, ఏవిఆర్ ప్రసాద్, కౌన్సిలర్లు దూదేకుల జైనాబి, చెరుకు శ్రీదేవి, మహిళా నాయకురాలు విజయ గౌరీ యాదవ్, నాసిరా, గోవిందు నాయుడు, దుమవత్ స్వామి నాయక్, బుగ్గ రాముడు, ముల్లా ఖాజా హుస్సేన్, గడిమేముల ఫరూక్, మహేష్ టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ దీక్షలను సాయంత్రం ఎవి సుబ్బారెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు.



నంద్యాల జిల్లా కేంద్రంలో దీక్షల్లో పాల్గొన్న ఎన్ ఎం డి ఫరూక్, మల్లెల రాజశేఖర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, ఏవి సుబ్బారెడ్డి తదితరులు

**ఆళ్లగడ్డ:** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా మాజీ మంత్రి భూమా అఖిలప్రియ స్థానిక తన స్వగృహం నుండి నాయకులు, కార్యకర్తలతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాలుగు రోడ్ల కూడలిలో ఆమె మాట్లాడుతూ వైసిపి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని అన్నారు. వైసిపిని ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయన్నారు. కౌన్సిలర్ హుస్సేన్ బాష, మాజీ జెడ్పిటిసి చాంద్ బాషా, కూడాల నారాయణరెడ్డి, నంద్యాల తెదేపా అధికార ప్రతినిధి పసల రాము యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

**చాగలమర్రి :** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి అవినీతి మరక అంటించేందుకు ప్రభుత్వం యత్ని చేస్తోందని టిడిపి మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్ భాష బాషా అన్నారు. ఆదివారం చాగలమర్రిలోని అడ్డవాగు సమీపంలో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్ బాష, మండల కన్వీనర్ నరసింహారెడ్డిల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చంద్రబాబుపై చిన్న మరకైనా అంటించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అది ఎప్పటికీ జరగదని, మచ్చలేని నాయకునిగా చంద్రబాబు బయటికి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. మాజీ మంత్రి అఖిల అఖిల ప్రియ చేపట్టిన రిలే నిరాహార దీక్షకు మద్దతుగా తాము పలు నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలియజేశారు. దీక్షా శిబిరంలో కూర్చున్న నాయకులకు టిడిపి నాయకులు పూలమాలలు వేసి సంఘీ భావం తెలిపారు. టిడిపి నాయకులు కొలిమి హు స్సేన్ వలి, కొలిమి షరీఫ్, కొలిమి మా బాష, గుత్తి నరసింహు లు, ఆలంసా గారి హనీఫ్, మౌలాలి, నారాయణరెడ్డి, రాజేష్, నాగూర్, షాబుల్, ఓబులేసు, అక్బర్ బాషా, బషీర్, షరీఫ్‌లు పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జిలతో ర్యాలీగా వస్తున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

మిగతా 6లో..

# ఐలమ్మ,రామకృష్ణ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం : ఆర్‌విఎస్

**ప్రజాశక్తి - ఆత్మకూర్**

భూమి కోసం,భుక్తి కోసం,వెట్టిచాకిరివిముక్తి కోసం పోరాడిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ, విద్యుత్ పోరాట అమరవీరుడు సత్తెనపల్లి రామకృష్ణ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి. యేసు రత్నం, ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు చందా వారి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని డాక్టర్ ఏ.ధనుంజయ మీటింగ్ హాల్ నందు చాకలి ఐలమ్మ, రామకృష్ణల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్తెనపల్లి రామకృష్ణ, చాకలి ఐలమ్మ ఆశయాల సాధన కోసం అందరూ ఐక్యంగా వివక్ష లేని సమాజం కోసం పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు డాల్ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు జోసెఫ్ చంద్రశేఖర్‌లు చాకలి ఐలమ్మ, రామకృష్ణపైన పాటలు పాడి వినిపించారు. ఈ కార్యక్రమ ంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసి ంహ నాయక్, రైతు సంఘం మండల అధ్యక్షులు మా బాష, నాయ కులు ఏ. రణధీర్, ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం పట్టణ అధ్యక్షులు రామకృష్ణ, నాయకులు శివుడు, వెంకటస్వామి, నాగరాజు, శోభన్ బాబు, గోపాల్, శ్రీని వాసులు,పాములపాడు మండల నాయకులు రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ పట్టణ పౌర సమాఖ్య నాయకులు ఏ సురేంద్ర, నాయకులు గణపతి,గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# 108 అంబులెన్స్‌లో ప్రసవం

**ప్రజాశక్తి - శ్రీశైలం**

శ్రీశైలంకు 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నారుట్ల గిరిజన గూడెంలో నివాసముంటున్న పులిచెర్ల బయమ్మ108 అంబులెన్స్‌లో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వేకువజామున మూడు గంటల సమయంలో తీవ్రమైన ప్రసవ నొప్పులు రావడంతో 108 కు సమాచారం ఇవ్వడం జరిగింది. వెంటనే 108 అంబులెన్స్ బయలుదేరి చిన్నారుట్ల చెంచు గూడెం చేరుకొని పురిటి నొప్పులతో బాధపడుతున్న పులిచెర్ల బయమ్మ ను 108 అంబులెన్స్‌లో సున్నిపెంట ప్రభుత్వాసుపత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యంలో శ్రీశైలం ముఖద్వారం సమీపంలో ఆడబిడ్డకు జన్మని చ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.



పగిడ్యాల బస్టాండ్ లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని డిఎంహెచ్ఓ

# వైద్య శిబిరాలు కొనసాగించాలి : డిఎంహెచ్ఓ

**ప్రజాశక్తి - పగిడ్యాల**

అతి సార ఉన్న గ్రామాలలో వైద్య శిబిరాలు కొనసాగించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ మండల వైద్య అధికారులకు ఆదేశించారు. ఆదివారం పగిడ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లా డారు. బీరవోలు, ఆంజనేయ నగర్ గ్రామాలతో పాటు పగిడ్యాల గ్రామంలో బస్టాండులో, అంబేద్కర్ నగర్‌లో వైద్య శిబిరాలను కొన సాగించాలని మండల వైద్య వైద్య అధికారులకు ఆయన ఆదేశించారు. ఇంటింటికి తిరిగి ఇంట్లో ఎవరైనా అతిసార బాధ్యతలు కనిపిస్తే వారిని తక్షణమే ఆరోగ్య కేంద్రానికి తీసుకురా వాలని ఆశా కార్యకర్తలకు ఆదేశించారు. గ్రామాలలో ఇంటిం టా తిరిగి కాచి చల్లార్చిన నీళ్లు తాగాలని, మినరల్ వాటర్ తాగాలని గ్రామస్తులకు అవగాహన కల్పించాలని ఏఎన్ఎంలకు, ఆశా వర్కర్లకు ఆయన సూచించారు. 24 గంటలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మందులు సిద్ధంగా ఉంచు కోవాలని సూచించారు. ఆదివారం రాత్రి 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొత్తగా 10 అతిసారా బాధ్యతలు వైద్య శాలలో అడ్మిట్ అయినట్టు మండల వైద్యాధికారి డాక్టర్ మోహన్ తెలిపారు. ఏడు మంది బాధ్యతలు డిశ్చార్జ్ అయినట్లు డాక్టర్ మోహన్ తెలిపారు.

# బాలిక అదృశ్యం

**ప్రజాశక్తి - బనగానపల్లె**

మండలంలోని పలుకూరు దేవనగర్ గ్రామానికి చెందిన మోరే మాధవి (14) అదృశ్యమైనట్లు నందివర్గం ఎస్సై రామాంజనే యరెడ్డి ఆదివారం తెలిపారు. దేవ నగర్ గ్రామానికి చెందిన మోరే చిన్నబాబు కుమార్తె మోరే మాధవి ఈనెల 8వ తేదీ రాత్రి తమ ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి రాత్రి పడుకున్న తర్వాత ఇంటి నుండి వెళ్లిపోయిందని ఎస్సై తెలిపారు. చుట్టు పక్కల, బంధువుల దగ్గర విచారించిన ఆచూకీ తెలియకపో వడంతో బాలిక తల్లి మోరే చిన్న లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



తప్పిపోయిన బాలిక (ఫైల్ ఫోటో)

# ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

**ప్రజాశక్తి - అవుకు**

మండలంలోని గుండ్ల సింగవరం గ్రామంలో కోటి 78 లక్షల రూపాయలతో రంగనాయకుల స్వామి ఆలయా పునర్నిర్మాణం కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. బనగానపల్లె శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి, పాణ్యం శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డిలు స్వగ్రామమైన గుండ్ల సింగవరం గ్రామంలో అతి పురాతన కాలం నాటి రంగనాయకుల స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆలయ పునర్నిర్మాణానికి సాంప్రదాయబద్ధంగా పూజలను నిర్వహించారు. టీటీడీ దేవస్థానానికి చెందిన పురోహితులు ఆలయం వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించిన తర్వాత బాలాలయం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బనగానపల్లె శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ఈ ఆలయం పునర్నిర్మానానికి అప్పటి దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకుపో వటంతో ఆయన వెంటనే ఈ ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వంచే అనుమతులు వచ్చేలా కృషి చేశారని తెలిపారు. పాణ్యం శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ తమ స్వగ్రామమైన గుండ్ల సింగవరం గ్రామంలో అతి పురాతన దేవాలయమైన శ్రీ గోదా రంగనాయకుల స్వామి ఆలయం, శిథిలావస్థకు చేరుకోవడంతో తన సోదరుడు కాటసాని రామిరెడ్డి, గ్రామస్తుల సహకారంతో ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టడం సంతోషం కలిగించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల

# పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గంగుల నాని అన్నారు. ఆదివారం ఆళ్లగడ్డ మున్సిపాలిటీ 3వ సచివాలయం పరిధిలోని పడకండ్ల గ్రామంలోని కైలాష్ నగర్,గంగమ్మ గుడి వీధి,నాగిరెడ్డి పల్లే రోడ్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆళ్లగడ్డ శాసన సభ్యులు గంగుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కేంద్ర కాటన్ బోర్డు మాజీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, బద్రి భాస్కర్ రెడ్డి బద్రి సుధాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# సమాజ సేవలో యువత ముందుండాలి : ఎంపిపి

**ప్రజాశక్తి - బేతంచర్ల**

యువత సమాజసేవలో పాలుపంచుకుని ఆదర్శ జీవనం గడపాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బాబు రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్త బస్టాండుకు వన్నూరు సాహెబ్ సహకారంతో నూతన బస్టాండు నిర్మాణమ్ నాడు నేడు చిత్రాలు, గోడ గడియారం ఎంపీపీ, వైఎస్ఆర్సిపి నాయకుల ఆధ్వర్యంలో బస్టాండ్ సిబ్బందికి అందజేశారు. సమాజ సేవకు తోడ్పాటు అందిస్తున్న వన్నూరు సాహెబ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ జిల్లా నాయకులు మూర్తి జావలి, మాజీ వైస్ కాజా, రామానాయుడు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన రెడ్డి



గ్రామోత్సవం చేస్తున్న దృశ్యం

# ఘనంగా గ్రామోత్సవం

**ప్రజాశక్తి - అవుకు**

అవుకు పట్టణంలో త్రైత సిద్ధాంత సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని గ్రామోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈనెల ఆరవ తేదీన మార్కెట్ వీధిలో శ్రీకృష్ణ ప్రతిమను ప్రతిష్టించి పూజలను ఐదు రోజులపాటు ఘనంగా నిర్వహించిన తర్వాత గ్రామోత్సవం ఘనంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామోత్సవంలో శ్రీకృష్ణుని గీతాలను ఆలపిస్తూ భజనలు కోలాటాలు భక్తులను ఆకర్షించాయి. త్రైత సిద్ధాంత సేవా సమితి అధ్యక్షులు నరేంద్ర, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాన సత్రానికి కుర్చీలు విరాళం

**ప్రజాశక్తి - బనగానపల్లె**

మండలంలోని టంగుటూరు పెద్దమ్మ అన్నదాన సత్రానికి భక్తులు 40 కుర్చీలను విరాళంగా ఇచ్చినట్లు అన్నదాన సత్రం కార్యదర్శి రామ గంగిరెడ్డి తెలిపారు. ఆదివారం పెద్దమ్మ అన్నదాన సత్రానికి టంగుటూరు గ్రామంలోని శ్రీ లక్ష్మి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నిర్వాహకుల బేతంచర్ల మండలం ఆర్. కొత్తపల్లి గ్రామానికి చెందిన తిరుమలేష్, ఆయన సతీమణి మాధవి , వీరి కుమారుడు వెంకట మధుమల్, కూతురు శ్రీవర్షిణి లు 40 డైనింగ్ కుర్చీలను విరాళంగా ఇచ్చారు.



పెద్దమ్మ అన్నదాన సత్రానికి కుర్చీలను విరాళం ఇస్తున్న దాత, చిత్రంలో దాత కుటుంబ సభ్యులు

# రామాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

మండలంలోని కోటకందుకూరు గ్రామంలో ఆదివారం నాడు నూతన రామాలయం ప్రారంభోత్సవంలో శాసనసభ్యులు గంగుల నాని పాల్గొన్నారు. కోట కందు కూరుకు చేరుకోగానే నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి వారిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీలర్ రామకృష్ణ, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రేణుక ఎల్లమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ

**ప్రజాశక్తి - బనగానపల్లె**

పట్టణంలోని రవ్వలకొండ వద్ద శ్రీ రేణుక ఎల్లమ్మ గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నిర్వహించారు. ఆదివారం పట్టణంలోనే రవ్వలకొండ సమీపంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ గుడికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రేణుక ఎల్లమ్మ గుడి నిర్మాణనికి 26 సెంట్ల స్థలాన్ని ఉచితంగా ఇచ్చిన దొంత వెంకటేశ్వర్లు దంపతులను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, గౌడ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ గౌడ కులస్తులకు ఈతవనాల అభివృద్ధి, ఏర్పాటుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు ఈడిగ పెద్ద వెంకటరమణ గౌడ్, చిన్న వెంకటరమణ గౌడ్ ,దేవుడు గౌడ్, వాయునంద గౌడ్ ,గౌడ సంఘం స్టేట్ సెక్రటరీ నారాయణ గౌడ్, పసుపల గ్రామ సర్పంచ్ మోహన్ బాబు గౌడ్ ,విజయ గౌడ్, రామచంద్ర గౌడ్ ,కొండయ్య గౌడ్, కిట్టయ్య గౌడ్, నాగార్జున గౌడ్, వెంకటసుబ్బయ్య గౌడ్ ,పెద్ద పాపోడు ,శేఖర్ గౌడ్ ,రామాంజనేయ గౌడ్ ,శివ గౌడ్ ,రమణ గౌడ్, అధిక సంఖ్యలో మహిళలు, గౌడ కులస్తులు పాల్గొన్నారు.



గుడి నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

# షాకీర్ మృతికి పలువురు సంతాపం

**ప్రజాశక్తి-నందికొట్కూరు టౌన్**

అకాల మరణం చెందిన మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్ షాకీర్ మృతికి సిపిఎం ప్రజా సంఘాల మండల కమిటీలు తీవ్ర సంతాపాన్ని ప్రకటించాయి. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు ఆదివారం మాట్లాడుతూ నందికొట్కూరు పట్టణంలోని చాకలిపేట కాలనీకి చెందిన ఎస్ రెహమున్, మౌలాలి దంపతులకు జన్మించిన ఏకైక కుమారుడు షాకీర్ అతి చిన్న వయసులోనే ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘంలో పనిచేస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారం దిశగా రాజీలేని పోరాటాలు చేశారన్నారు. ఎస్ఎఫ్ఐలో పనిచేసి, సిపిఎం నాయకుడుగా ప్రజా సమస్యల కోసం పనిచేయడం జరిగిందన్నారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు, షాకీర్ అకాల మరణం బాధాకరం విషయమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.పకీరు సాహెబ్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా నాయకులు టి.గోపాలకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డక్క కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎన్ రాము, మహిళా సంఘం జిల్లా నాయకురాలు ఎస్‌బిబి, సంతాపం వ్యక్తం చేశారు.



మాజీ ఎస్.ఎఫ్.ఐ నాయకుడు మతికి సంతాపం తెలిపిన: సిపిఎం ప్రజా సంఘాల నాయకులు

# ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు ప్రారంభం

**ప్రజాశక్తి - నంద్యాల**

నంద్యాల జిల్లా ఫుట్ బాల్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్పీజీ మైదానంలో 16 సంవత్సరాల లోపు నంద్యాల జిల్లా బాల బాలికల జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఫుట్ బాల్ సంఘం అధ్యక్షులు కె.ఈ. వినయ సాగర్ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు, ఫుట్ బాల్ జిల్లా సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జి రవికృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఫుట్ బాల్ సంఘం అధ్యక్షులు వినయ సాగర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా తరపున రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే 16 సంవత్సరాల లోపు బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని,16 మందితో కూడిన జట్లు ఎంపిక చేయడం జరుగుతుందని చెప్పారు. ఎంపికైన జట్లు అనంతపురంలో జరిగే 16 సంవత్సరాలలోపు రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ టోర్నమెంట్లో పాల్గొంటారని తెలిపారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీజీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా ఫుట్ బాల్ సంఘం ఉపాధ్యక్షులు జెడ్.ఎస్.పి. దివాకర్, హరివరం జెడ్పి స్కూల్ ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, నంద్యాల జిల్లా ఫుట్ బాల్ సంఘం కార్యదర్శి అనిల్ బాబు, కోశాధికారి జగదీష్, ఉపాధ్యక్షులు రాజు, సంయుక్త కార్యదర్శి రాజా చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఫుట్ బాల్ సంఘం జిల్లా జట్ల ఎంపిక పోటీల కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డాక్టర్ రవి కృష్ణ

# ప్రొ వాలీబాల్ విజేత వైట్ వాకర్స్ జట్టు

**ప్రజాశక్తి - నంద్యాల**

ఇంట్రా స్కూల్లో భాగంగా ప్రొ వాలీబాల్ టోర్నమెంట్‌లో వైట్ వాకర్స్ జట్టు విజేతగా నిలిచిందని డైరెక్టర్ పి. షేక్షావలి రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 200 మంది విద్యార్థులను 15 టీములుగా ఏర్పాటు చేసి, 15 మంది పిఇటి మాస్టర్ల పర్యవేక్షణలో టోర్నమెంట్ నిర్వహించడం జరిగిందన్నారు. వాలీబాల్ టోర్నమెంట్ విజేతల బహుమతి ప్రధానోత్సవానికి గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డా.పి. దస్తగిరి రెడ్డి, నంద్యాల ఎంఇఒ బ్రహ్మం ఫైనల్ మ్యాచ్ వీక్షించి విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ టోర్నమెంట్ నందు బెస్ట్ ప్లేయర్ అభిషేక్ (9 క్లాస్)కు మెమొంటోను ప్రధానం చేశారు. టోర్నమెంట్ విన్నర్స్ గా వైట్ వాకర్స్ టీమ్, రన్నర్స్‌గా రైజింగ్ స్టార్స్ టీమ్ విజేతలుగా నిలిచాయి. విజేతలకు మెడల్స్‌తో పాటు జ్ఞాపికలు అందజేసి వారి విజయాలను అతిథులు ప్రశంసించారు.



విజేతలకు మెడల్స్, బహుమతులు అందచేస్తున్న ముఖ్య అతిథులు

## శ్రీశైలంలో రెగ్యులర్ కోర్టు ఏర్పాటు చెయ్యండి

**ప్రజాశక్తి - శ్రీశైలం**

శ్రీశైలంలో రెగ్యులర్ కోర్టు చెయ్యాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శేష సాయికి శ్రీశైల క్షేత్ర పరిరక్షణ సమితి వినతి పత్రం అందజేసింది. ఆదివారం శ్రీశైలం వచ్చిన జడ్జితో శ్రీశైల క్షేత్ర పరిరక్షణ సమితి నేతలు కలిసి పలు సమస్యలు వివరించారు. శ్రీశైలం మండల ప్రజలు కోర్టు కేసులు గురించి ఆత్మకూరుకు వెళ్లాలంటే ఎంత వ్యయ ప్రయాసలకు గురి అవుతున్నారని, సుమారు 25వేల మంది జనాభా కలిగిన ఈ మండలంలో ఎక్కువ శాతం పేద వారు అధికంగా ఉన్నారని రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితిలో కొందరు ఉన్నారని పేర్కొన్నారు. స్పందించిన జడ్జి త్వరలోనే ఏర్పాటు చేయిస్తామని వారికి చెప్పారు.



జడ్జికి వినతి పత్రం ఇస్తున్న నేతలు

## ఎస్‌టియు కార్యాలయం ప్రారంభం

**ప్రజాశక్తి - చాగలమర్రి**

చాగలమర్రిలోని రిక్వెస్ట్ సాపు సమీపంలో నూతనంగా నిర్మించిన ఎస్‌టియు ఉపాధ్యాయుల యూనియన్ కార్యాలయాన్ని గ్రామ ఉపసర్పంచ్ మహమ్మద్ సోహెల్ ఆదివారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీయూ సంఘం నాయకులు ఉపాధ్యాయుల సమస్యల పరి ష్కారానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దష్టికి తీసుకొని వస్తే తన వంతుగా కీషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో సన్మాన సభ ఏర్పాటు చేసి పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సంజీవరెడ్డి, అబ్దుల్ ఖాదర్, ఉస్మాన్, విజయరాజు, నాగభూషణం, విశ్వనాథ రెడ్డి, ప్రభావతి ,మహంతి దేవి, హరిబాబు లను ఎస్ టూ సభ్యులు సన్మానించారు. ఎంఇఒ అనురాధ, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబూ లాల్, మండల అధ్యక్షుడు వీరభద్రుడు, తదితరులు పాల్గొన్నారు.



యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## ఖబరస్తాన్‌లో బోర్ బావి ఏర్పాటు

- ఎమ్మెల్యే ఆర్థర్‌కు కృతజ్ఞతలు తెలిపిన మత పెద్దలు

**ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్**

నందికొట్కూర్ పట్టణం కర్నూల్ రోడ్డు మార్గంలో పట్టణ ముస్లిం ప్రజల అవసరాల కోసం ఏర్పాటైన ఖబరస్తాన్‌లో ఎమ్మెల్యే ఆర్థర్ సహకారంతో ఆదివారం బోర్ బావి ఏర్పాటు చేయడం జరిగిందని, 3 ఇంచులు నీరు రావడం హర్షణీయం అని మత పెద్దలు పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కబరస్థాన్లో నీటి సౌకర్యార్థం కోసం ఎవరికి విన్నవించిన పట్టించుకోలేదని కానీ నేడు ఎమ్మెల్యే అర్థర్ సహకారం మరువలేనిదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మాలిక్ (హాఫిసాబ్), ఇమ్రాన్(హాఫిసాబ్), సైఫులా (హాఫిసాబ్), మొల్ల రబ్బానీ(మున్సిపల్ వైస్-చైర్మన్),మొల్ల జాకీర్ హుస్సేన్(2 వ వార్డ్ కౌన్సిలర్), వజీర్ బాషా,మాబాషా,వలి, లతీఫ్,గౌండ బాబు,మన్సూర్, ముజీబ్, అబ్బాస్, ఆఫ్రిద్, అబ్దుల్లా తదిరులు పాల్గొన్నారు.



## రేషన్ బియ్యం పట్టివేత : ఎస్ఐ

**ప్రజాశక్తి - మహానంది**

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు మండలంలోని బొల్లవరం గ్రామంలో ఆదివారం పట్టుకొని మహానంది పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు ఎస్సై నాగేంద్రప్రసాద్ తెలిపారు. రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం రావడంతో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహిం చారని, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ముగ్గురు వ్యక్తులు దూదేకుల షాలీసా, ఖాసిం, చిన్న హుస్సేన్ కలిసి అక్రమంగా తరలిస్తున్న 176 బస్తాలు రేషన్ బియ్యం సుమారు 111. కింటాల 60 కేజీలు బియ్యం మరియు మీని లారీ వాహనం ను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. ముగ్గురు వ్యక్తుల ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై నాగేంద్రప్రసాద్

## నేడు 'జగనన్నకు చెబుదాం - స్పందన'

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం నంద్యాల పట్టణం కలెక్టరేట్ లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో వినూత్న తరహాలో "జగనన్నకు చెబుదాం - స్పందన" కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా "జగనన్నకు చెబుదాం - స్పందన" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## 13న మండల స్థాయి క్రీడా పోటీలు

**ప్రజాశక్తి - పాములపాడు**

పాములపాడు మండల స్థాయి క్రీడా పోటీలు ఈనెల 13వ తేదీన బుధవారం ఉదయం 9 గంటలకు అండర్ 14, 14వ తేదీ అండర్ 17 మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎస్‌జిఎఫ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బాలాజీ నాయక్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామసుబ్బమ్మ ఆదివారం తెలిపారు. ఈ ఎంపిక పోటీలు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాములపాడు నందు నిర్వహించినట్లు వారు తెలిపారు. రాష్ట్ర స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో 9 కీడాంశాలలో కబడ్డీ, ఖోఖో, త్రో బాల్, బాల్ బ్యాట్మెంటన్, వాలీబాల్, షటిల్ బ్యాట్మెంటన్, టెన్నికాయట్, యోగా, అథ్లెటిక్ క్రీడాంశాల యందు అండర్ 14, అండర్ 17 బాల బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల ఎస్‌జిఎఫ్ సమన్వయకర్త నాగ రాజు తెలిపారు. మండల స్థాయిలో ఎన్నిక కాబడిన విద్యార్థులు త్వరలో జరగబోయే నియోజకవర్గస్థాయి ఎంపిక పోటీలలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రాజశేఖర్, శ్రీనివాసులు, సుమలత, సాయి కృష్ణ, కళ్యాణి పాల్గొన్నారు.



మోటివేటర్ డాక్టర్ శరత్ చంద్ర ను సన్మానిస్తున్న దృశ్యం

## సమస్యలను అధిగమించే ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి

**ప్రజాశక్తి - నంద్యల**

జీవన గమనంలో సమస్యలు వచ్చినప్పుడు బలవన్మరణాలకు పాల్పడకుండా ఆత్మవిశ్వాసం పెంచుకోవాలని సైకియాట్రిస్ట్ శరత్ చంద్ర పేర్కొ న్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ సందర్భంగా ఆదివారం న్యూక్లియస్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ చంద్ర మాట్లాడుతూ జీవనగమనములో సమస్యలను అధిగమిస్తూ విద్యార్థులు పూర్తి ఆత్మవిశ్వాసముతో ముందుకు సాగాలని కోరారు. స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (ఎస్ఐఇఎఫ్)సౌజన్యముతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షులు అన్నెం శ్రీనివాస రెడ్డి, కార్యదర్శి శేష పణి సభ్యులు నీలం వెంకటేశ్వర్లు, ప్రసాద్, గోపాలకృష్ణ, కళాశాల యాజమాన్యం వాసుదేవ రెడ్డి, మురళీధర్ రెడ్డి, అధ్యాపకులు రమణారెడ్డి.తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో కొండ చిలువ హల్ చల్

**ప్రజాశక్తి శ్రీశైలం**

శ్రీశైలంలోని కొత్తపేట ఎస్సీ కాలనీలో భారీ కొండచిలువ హల్ చల్ చేసింది. సుమారు 9 అడుగుల పొడవు కలిగిన కొండచిలువను చూసిన చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురై శ్రీశైలం స్నేక్ క్యాచర్ రాజుకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్ రాజు వెంటనే బయలుదేరి కొండచిలువ కనిపించిన ఇంటి ప్రాంతానికి చేరుకున్నాడు. సుమారు అరగంట సేపు శ్రమించి భారీ కొండచిలువను పట్టుకుని శ్రీశైలంకి దూరంగా అటవీ ప్రాంతంలో వదిలిపెట్టడం జరిగింది దీంతో ఆ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## గర్భిణులకు అన్నదానం

**ప్రజాశక్తి - నందికొట్కూరు**

నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రంలో శ్రీ సాయిరాం విద్యాసంస్థల అధినేత పి. సుధాకర్ రెడ్డి సహకారంతో కూతురు పి. దివ్య రెడ్డి జన్మదిన సందర్భంగా, జువ్వా జి సుంకన్న గౌడ్ సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణీలకు, రోగులకు ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీలకు రోగులకు, అన్న దానం చేయడం గర్వించదగ్గ విషయ మన్నారు. డాక్టర్ శ్వేత, హెడ్ నర్స్ భువనేశ్వరి, ల్యాబ్ టెక్నీషియన్ ధనుంజయ, నేతృత్వ ంతో వైద్యులు మెరుగైన చికిత్సలు అందిస్తున్నారని తెలిపారు. 200 మంది గర్భిణీలు చికిత్స కోసం ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారంటే అది వైద్యుల సేవ నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జువ్వా జి సుంకన్న గౌడు సేవా సమితి అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, దేశెట్టి శ్రీనివాసులు, అరుణ్, రమేష్, ఆనంద్, బజాజ్ రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న దృశ్యం

## 12న మండల స్థాయిక్రీడా పోటీలు

**ప్రజాశక్తి - రుద్రవరం**

ఈనెల 12వ తేదీ రుద్రవరం మండల స్థాయి పాఠశాలల అండర్ 14 అండర్ 17 బాల బాలికలకు క్రీడా ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ కె,కోటయ్య, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రుద్రవరం ప్రధానోపాధ్యాయులు జె.వి సుబ్బారాయుడు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు 9 క్రీడాంశాలలో టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ నిర్వహించబడతాయన్నారు. మరిన్ని వివరాలకు 9490192007,9052232733 నంబర్లను సంప్రదించాలన్నారు.

## అవినీతికి మూల్యం తప్పదు

- ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి

**ప్రజాశక్తి - అవుకు**



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన అవినీతికి మూల్యం చెల్లించుకోక తప్పదని ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఆయన చేసిన అవకతవకలకు పాపం పండిందని రూ.370 కోట్ల స్కామ్ లో ఆధారాలు బయటపడడంతో ఏసీబీ అధికారులు ఆయనను అరెస్టు చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. తప్పు చేసిన వ్యక్తులు ఎవరైనా సరే చట్టం ముందు సమానమని అన్నారు.

## విద్యుత్ సేవలు నిలిపివేత

**బేతంచర్ల :** ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో రోడ్డు విస్తరణలో భాగంగా సోమ, మంగళ, బుధవారాల్లో మధ్యాహ్నం 1:00 నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సేవలు నిలిపివేనున్నట్లు విద్యుత్ ఏడి మధు సూదన్ రెడ్డి, విద్యుత్ రూరల్ ఏఈ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు.



# చంద్రబాబు అరెస్టుపై వెలువెత్తిన నిరసన దీక్షలు

(5వ పేజీ తరువాయి.. ) **పాములపాడు :** పాములపాడు మండల కేంద్రంలో టిడిపి నాయకుల సామూహికంగా నిరాహార దీక్షలు నిర్వహించారు. మండల టిడిపి నాయకులు తిమ్మారెడ్డి, బండ్లమూరి వెంకటేశ్వర రావు, రవీంద్రనాథ్ రెడ్డి, గోవిందు, చంద్రశేఖర్, మధు కృష్ణ, అబ్దు ల్ ఆఫీస్, కృష్ణయ్య, భాస్కర్ రెడ్డి, సురేష్, లింగస్వామి, నాగలక్ష్మి రెడ్డి, ఉస్మాన్ బాష, తదితరులు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. దీక్షలకు బీసీ సంఘం నాయకులు బత్తుల సంజీవ రాయుడు అడ్వకేటు బతుకులయ్య సంఘీభావం తెలిపారు. **నందికొట్కూరు :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అక్రమ అరెస్టు చేసినందుకు నిరసనగా నందికొట్కూరు పట్టణంలో నంద్యాల పార్లమెంటు ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఇంచార్జ్ గౌరు వెంకటరెడ్డి, ఆదేశాల మేరకు టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జయ సూర్య ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ చంద్రబాబుపై కుట్ర పన్నీఅక్రమంగా కేసు బనాయించారని ఆయనను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్చార్జ్ జయ సూర్య, టిడిపి అధికార ప్రతినిధి కాకరవాడ చిన్న వెంకటస్వామి, నియోజకవర్గ నాయకులు బండి జయరాజు, ముత్తు జావలి, కాతా రమేష్ రెడ్డి, వెంకటేశ్వర్ల యాదవ్, సంపత్ కుమార్ యాదవ్, రఘురామిరెడ్డి, ఓబుల్ రెడ్డి, మండ్రా రత్నాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, నారాపురెడ్డి,నిమ్మకాయల రాజు, కళాఖర్,బి.రాజన్న, ప్రవీణ్ రగడ, ప్రభు కుమార్, ఇంతియాజ్, రవికుమార్ యాదవ్, సురేష్, బ్రహ్మయ్య, రవి చౌదరి, గని, బ్రహ్మానందరెడ్డి, పగడం శేఖర్, పాలమారి నాగరాజు, ఇంతియాజ్ బాష, రాజశేఖర్, మద్దిలేటి, పాల బాబు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **రుద్రవరం :** నారా చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యమువలే బయటికి వస్తాడని టిడిపి యువ నాయకులు భూమా విఖ్యాత్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఎల్వి రంగనాయకుల శెట్టి, మాజీ సర్పంచ్ పోలా గురుమూర్తి, పలువురు టిడిపి నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన రుద్రవరంలోని అమ్మవారి శాల సెంటర్‌లో నిరాహార దీక్ష చేపట్టారు. టిడిపి నాయకులు చేపట్టిన దీక్షకు యువ నాయకుడు భూమా విఖ్యాత్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడారు. టిడిపి నాయకులు ముత్తలూరు రామ సుబ్బారెడ్డి, బాచేపల్లి నారాయణ, యువరాజు, పకీరయ్య గౌడ్, లక్ష్మీకాంత్ యాదవ్, మజ్జిగ చంద్ర, యువ నాయకుడు దస్తగిరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **బనగానపల్లె:** పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా, టిడిపి నియోజకవర్గ నాయకులు బిసి రామనాథరెడ్డి, బిసి మహేశ్వరమ్మలు రిలే నిరాహార దీక్షలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కడిగిన ముత్యం లా బయటికి వస్తారని తెలిపారు. పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, కాట్ రెడ్డి మల్లికార్జున రెడ్డి, పాతపాడు, మిట్టపల్లె సర్పంచులు బెడదల మహేశ్వరరెడ్డి, తులసి రెడ్డి, టిడిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణా నాయక్, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఖాసింబాబు, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం మండల కార్యదర్శి ఖాదర్ బాషా నాయకులు అన్వర్ సాహెబ్, టిప్ టాప్ కలాం, అల్తాఫ్ హుస్సేన్, బొబ్బల రామ మద్దిలేటి రెడ్డి, నుసి విష్ణువర్ధన్ రెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**అవుకు:** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ఆధారాలతో మాయని మచ్చ తీసుకురావాలని వైసిపి ప్రభుత్వం శత విధాల ప్రయత్నిస్తోందని అవుకు టిడిపి నాయ కులు ఆవుల జయ శివుడు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నిప్పులాంటి మనిషి అని ఆయనకు ఎటువంటి తప్పుడు కేసులు బనాయించినా మరింత ఉత్సాహంతో బయటికి వచ్చి తెలుగు దేశం పార్టీ గెలుపునకు కృషి చేస్తారని అన్నారు.

**వెలుగోడు:** చంద్రబాబు నాయుడు ను అక్రమంగా అరెస్టు చేశారని వెలుగోడు పట్టణంలోని టిడిపి కార్యాలయం ఎదురుగా మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు




వెలుగోడు: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి




రిలే నిరాహార దీక్ష చేస్తున్న బీసీ



చాగలమర్రి : రిలే నిరాహార దీక్ష చేస్తున్న టిడిపి నాయకులు



నందికొట్కూరు: మాట్లాడుతున్న గౌరు వెంకట్ రెడ్డి



రుద్రవరం : టిడిపి నాయకుల దీక్షకు సంఘీభావం తెలిపిన భూమా విఖ్యాత్ రెడ్డి